

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 5: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- మద్యం షాపుల లీజు దరఖాస్తులకు వెళితే ఎక్సైజ్ పోలీసుల వింత ప్రశ్న
- జిల్లాలో 99 మద్యం దుకాణాలు
- వచ్చిన దరఖాస్తులు 128.. మిగిలిన గడువు నాలుగు రోజులే
- ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసేందుకు అవకాశం
- టీడీపీ, వైసీపీ నేతల రహస్య ఒప్పందం?
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం



ఎమ్మెల్యే సార్‌తో చెప్పారా..?

కర్నూలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల్లో ఓట్ల కోసం నువ్వా.. నేనా..! అంటూ తలపడ్డారు. విమర్శనాస్త్రాలు సంధించారు. వాళ్లను నమ్ముకున్న కార్యకర్తలు గొడవులు పడి కేసులు ఎదుర్కొన్నారు. ఇదంతా ఎన్నికల ముందు.. ఇప్పుడు ఎన్నికలు లేవు.. ఓటర్లతో అవసరం లేదు. అందుకే నువ్వు.. నేను అంటూ మద్యం షాపుల టెండర్లకు సై అంటున్నారు. పార్టీ కోసం బలంగా పని చేసిన మండల స్థాయి నాయకులు, బలమైన కార్యకర్తలు మద్యం దుకాణాలు లీజు కోసం దరఖాస్తు చేద్దామంటే వారిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దరఖాస్తుల కోసం ఎక్సైజ్ పోలీస్ స్టేసన్‌కు వెళితే.. ఎమ్మెల్యే సార్‌తో చెప్పారా..? అంటూ ప్రశ్నిస్తుండడంతో అవాక్కు అవుతున్నారు. రూ.లక్షల పెట్టి దరఖాస్తు చేస్తే.. లాటరీలో దుకాణం వచ్చినా.. రెండేళ్లు ఆ షాపును నడపాలంటే ఎమ్మెల్యే, ఎక్సైజ్ అధికారుల సహకారం ఉండాలి. వాళ్లే వింత ప్రశ్నలు వేస్తుండడంతో ఎందుకులే అని వెనుదిరుగుతున్నారు. అయితే.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయవచ్చని, ఎవరికి భయడాల్సిన అవసరం లేదని జిల్లా అధికారులు అంటున్నారు. టీడీపీ, వైసీపీ ముఖ్య నేతల రహస్య ఒప్పందాలు జరిగిపోయాయనే ప్రచారంతో మద్యం వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 204 మద్యం దుకాణాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వమే నిర్వహించేది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాత ఎక్సైజ్ విధానామే అమలుల్లోకి తీసుకొస్తూ నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టింది. అందులో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు రెండేళ్ల లీజుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల ఒకటో తారీఖు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణకు ఆఖరు గడువు ఉంది. మద్యం షాపులను రెండు విభాగాలుగా విభజించారు. 5 వేల నుంచి 10 వేల జనాభా కగిలిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మద్యం షాపునకు మొదటి ఏడాది రూ.55 లక్షలు, రెండవ ఏడాది రూ.6.50 లక్షలు, 11 వేలు ఆపై జనాభా కగిలిన పట్టణాలు, మండల కేంద్రాల్లో షాపులకు తొలి ఏడాది రూ.65 లక్షలు, రెండవ ఏడాది రూ.71.50 లక్షలు లీజు (రెంటల్) నిర్ణయించారు. మద్యం దుకాణాలపై ఎమ్మెల్యేలు, కీలక రాజకీయ నాయకులు కన్ను పడడంతో.. గతంలో ఏన్నో ఏళ్లుగా ఇదే వ్యాపారంలో ఉన్న వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.



ప్రభుత్వ ఆదాయానికి గండి

అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొందరు, కూటమి ముఖ్య నాయకులు కొందరి వైఖరి వల్ల ప్రభుత్వ ఆదాయానికి, సీఎం చంద్రబాబు లక్ష్యానికి గండి పడుతుందనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో 99 మద్యం షాపులు ఉన్నాయి. ఒక్కో షాపునకు 8 నుంచి 12 దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా. సగటున షాపునకు 10 చొప్పున వెయ్యి దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన ఒకో దరఖాస్తుకు రూ.2 లక్షల ప్రకారం రూ.20 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే ఒక్కో దుకాణానికి 2-5 దరఖాస్తులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అదే జరిగితే ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడే ప్రమాదం ఉంది. ఆఫ్‌లైన్‌లో అధికార పార్టీ నేతలు, వారి సిఫారసులతో బదిలీపై వచ్చిన ఎక్సైజ్ అధికారులు కొందరు అడ్డుకట్ట వేసినా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయితే.. వీరిద్దనికి కాదని ఆన్‌లైన్ దరఖాస్తు చేసినా.. లాటరీలో దుకాణం వచ్చినా ఆ తరువాత స్వేచ్ఛగా మద్యం వ్యాపారం చేసుకోనిస్తారా..? అన్న ప్రశ్నలు మద్యం వ్యాపారులను వేధిస్తున్నాయి. 9వ తేదీ వరకు దరఖాస్తుకు ఆఖరు గడువు. ఇప్పటికే ఐదు రోజులు గడిచింది. వచ్చిన దరఖాస్తులు 128 మాత్రమే. నేటితో మిగిలిన గడువు నాలుగు రోజులే. మద్యం వ్యాపారులకు భరోసా ఇచ్చి లక్ష్యం మేరకు దరఖాస్తులు రాబట్టడంలో ఆ శాఖ అధికారులు ఏమేరకు సక్సెస్ అవుతారో వేచి చూడాల్సిందే.

జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారిగా ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
కర్నూలు	31	45
కోడుమూరు	14	30
ఎమ్మిగనూరు	15	7
కోసిగి	4	2
పత్తికొండ	14	18
ఆదోని	12	8
ఆలూరు	9	18
మొత్తం	99	128



నిర్భయంగా దరఖాస్తు చేయవచ్చు

మద్యం దుకాణాలల లీజు కోసం దరఖాస్తు చేయడానికి ఈ నెల 9 వరకు గడువు ఉంది. నిర్భయంగా దరఖాస్తు చేయవచ్చు. జిల్లా ఎక్కడైనా ఇబ్బంది ఉంటే మా ఆఫీసుకు వస్తే దరఖాస్తు చేయిస్తాం. అంతేకాదు.. ఆన్‌లైన్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. లాటరీలో మద్యం దుకాణం వస్తే స్వేచ్ఛగా మద్యం వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తాం. ఎవరు కూడా భయపడాల్సిన అవసరం లేదు.

- సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు

అప్పుడే రహస్య ఒప్పందం

పోయిన ఎన్నికల్లో నువ్వా.. నేనా అంటూ ఎన్నికల రణక్షేత్రంలో తలపడిన రాజకీయ ప్రత్యర్థులే.. మద్యం దుకాణాలు వద్దకు వచ్చేపాటికి నువ్వు.. నేను అంటూ రహస్యంగా మద్యం షాపులు పంపకాలు చేసుకున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. మద్యం షాపు లీజు కోసం దరఖాస్తు చేయాలంటే రూ.2 లక్షలు చెల్లించాలి. షాపు లాటరీలో తగలినా తగలకపోయినా ఈ డబ్బును తిరిగి ఇవ్వరు. దీంతో పోటీ పడి దరఖాస్తులు చేస్తే దుకాణాలు ప్రత్యర్థి పార్టీ నాయకులకే లాటరీ (డిప్)లో తగిలితే ఆదాయం కోల్పోతాం. ఆ ఇబ్బందులు రాకుండా పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే రహస్య ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆదోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 షాపులకు 21 దరఖాస్తులే వచ్చాయి. ఏడు షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 4 షాపులు ఉంటే.. రెండు షాపులకు కేవలం రెండే దరఖాస్తులు వచ్చాయి. ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 షాపులకు గానూ కేవలం 8 దరఖాస్తులు వచ్చాయి. పత్తికొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14 షాపులు ఉంటే 18 దరఖాస్తులు వచ్చాయి. ఆరు షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఆలూరు సర్కిల్ పరిధిలో 9 దుకాణాలకు వచ్చిన దరఖాస్తులు 14 మాత్రమే. జిల్లాలో 99 షాపులకు గానూ 60 షాపులకు 128 ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చాయి. 39 షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం కొసమెరుపు. పలు నియోజకవర్గాల్లో దరఖాస్తులు చేయకుండా అధికార పార్టీ ముఖ్యనాయకులు బెదరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. కొత్తగా మద్యం వ్యాపారం చేద్దామని ముందుకు వచ్చిన కొందరు దరఖాస్తు కోసం ఎక్సైజ్ స్టేషన్‌కు వెళితే.. ఎమ్మెల్యే సారుతో మాట్లాడారా..? ఆయనకు చెప్పే వచ్చారా..? ఫలానా ముఖ్య నాయకుడితో మాట్లాడుకున్నారా..? అంటూ ఎక్సైజ్ అధికారులే ప్రశ్నిస్తుండడంతో ఆసక్తి ఉన్నా.. రాజకీయాలు గొడవ మాకెందుకులే అంటూ వెనుదిరుగుతున్నట్లు సమాచారం.

15 శాతం వృద్ధి రేటు లక్ష్యం

- స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళిక
- కలెక్టర్ రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 5: జిల్లాలో ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ఐదేళ్లకు స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికలను రూపొందిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర-2047 జిల్లా దార్శనిక ప్రణాళిక (2024-29) రూపకల్పన నిమిత్తం వివిధ వర్గాలు, అసోసియేషన్‌లతో సమావేశమై వారి సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి కానున్న సందర్భంగా అన్ని రంగాల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి ధ్యేయంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా ఐదేళ్ల కాలంలో అభివృద్ధి లక్ష్యాలతో గ్రామ, మండల, జిల్లా విజన్ ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. 2022-23 నాటికి కర్నూలు జిల్లా జీడీపీ 47514 కోట్లతో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉందని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవ హిమప్రభాకర్ రాజు, వివిధ వర్గాలు, సంఘాలు అసోసియేషన్‌ల ప్రతినిధులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయండి

నేషనల్ హైవేకి సంబంధించిన రహదారులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవే రహదారుల పురోగతిపై నేషనల్ హైవే అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్‌హెచ్-40 భూసేకరణకు సంబంధించి నష్టపరిహారాన్ని వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌హెచ్-340సీకి సంబంధించి పసుపుల, రుద్రవరం గ్రామాలకు సంబంధించిన క్లెయిమ్స్‌ను త్వరగా పంపించాలని ఆదేశించారు. బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబరు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ దరఖాస్తులను పరిష్కరించాలి: డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చిరంజీవి

కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 5: ఆర్‌టీఐ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని డీఆర్వో చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం డీఆర్వో చాంబర్‌లోని జిల్లాలోని ఉన్న ప్రతి శాఖ అధికారులతో ఆర్‌టీఐ కింద ఎవరైనా అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లో సమాధానం తెలియజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోగుల ఓపీ కోసం.. మానిటరింగ్ కమిటీ

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 5: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగుల కోసం మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, యురాలజీ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డా.కే.సీతారామయ్య, సైక్రియాట్రిక్ హెచ్‌వోడీ డా.ఎన్.నాగేశ్వరరావు, సీఎస్ఆర్ఎంవో డా.బి.వెంకటేశ్వరరావు, ఓపీ మానిటరింగ్ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలకు సంబంధించిన ప్రతి వైద్యుడు రోజు నిర్వహించే ఓపీ సేవలను మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ఉదయం ఓపీలో రోగులకు సేవలు, చికిత్సలను కమిటీ తెలుసుకుంటుందని తెలిపారు. అలాగే సాయంత్రం పూట ఓపీలో ఉదయం వచ్చిన రోగులకు సాయంత్రం వైద్యులు చూస్తున్నారా లేదా అనేది కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. ఓపీ విధులను తక్కువ పని తీరు కనబరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి సంబంధించిన ఓపీ వివరాలను ప్రతి నెలా 5వ తేదీలోగా కమిటీ సభ్యులు డీఎంఈకి నివేదికలను పంపనున్నట్లు ఆయన తెలిపారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- దేవరగట్టును సందర్శించిన జిల్లా అధికారులు
- నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామస్థులతో సమీక్ష

హొళగుంద, అక్టోబరు 5 : దేవరగట్టు బన్నీ ఉత్సవాలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ బీ నవ్య కోరారు. శనివారం ఎస్పీ, జేసీ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ డీఎస్పీ వెంకటరమణయ్య, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం నెరణికి, నెరణికితండా, కొత్తపేట గ్రామాల ప్రజలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలలో భాగంగా సంప్రదాయం పేరుతో కొట్టుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కక్షలకు, ప్రతికారాలకు తావు ఇవ్వకుండా బన్నీ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. రింగు కర్రలను ఎవరూ కూడా తీసుకురాకూడదని అన్నారు. ఇప్పటికే గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో నసరా రెడ్డి, డీపీవో భాస్కర్, హొళగుంద తహసీల్దార్ ప్రసాద్ రాజు, ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, హొళగుంద ఎస్సై బాల నరసింహాలు పాల్గొన్నారు.



దేవరగట్టులో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

టమోటా కిలో రూ.75



ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 5 : టమోటా ధరలు సామాన్యులను తారైతిస్తున్నాయి. నిన్నటి వరకు మార్కెట్‌లో కేజీ రూ.20 పలికినా టమోటా ధరలు అమాంతంగా పెరిగాయి. తీవ్రంగా కురుస్తున్న వర్షాలకు పంట దిగుబడి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.75 పలుకుతున్నాయి. సామాన్యులు టమోటాలను కొనలేక చింతపండు ఉపయోగించుకొని పప్పుచారు చేసుకుంటున్నారు. మరి కొద్ది రోజుల్లో రూ.100 దాటే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. టమోటా ధరను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీశైలానికి స్వల్పంగా వరద

శ్రీశైలం, అక్టోబరు 5: శ్రీశైలం జలాశయానికి శనివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 38,621 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 117 క్యూసెక్కులు మొత్తం 38,783 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 43,742 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 198.8120 టీఎంసీలుగా నమోదయింది. ఏపీ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,350 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,163 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

భూసంరక్షణకు ప్రతిపాదనలు

డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 5: భూసంరక్షణకు రూ. 8కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు భూసంరక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూసంరక్షణ కోసం ఏయే పనులు చేపడుతారో ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారని, ఇందులో భాగంగా రూ.8 కోట్లతో రైతుల పొలాలను సారవంతం చేసేందుకు అవసరమైన పనులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి అందజేశామన్నారు. దశలవారిగా భూసంరక్షణ అభివృద్ధి పనులకు నిధులు విడుదల కానున్నాయని, త్వరలోనే ఈ నిధులు వస్తాయని రైతుల పొలాలను సారవంతం చేసే పనులు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూసంరక్షణ పనులను అటకెక్కించారు. ఐదేళ్లుగా కనీసం ఒక్క రూపాయి కూడా భూసంరక్షణ కోసం విడుదల చేయకపోవడంతో అధికారులు, సిబ్బంది కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. ఏయే పనులు చేపట్టి రైతుల పొలాలను సారవంతం చేయాలో నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపడం తప్ప.. అక్కడి నుంచి నిధులేమి రాకపోవడంతో అధికారులు నిస్సహాయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. రైతులకు సమాధానం చెప్పుకోలేక పొలాల బాట పట్టలేని పరిస్థితి అధికారులకు ఎదురైంది.

రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు



రావణ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

- చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి
- శ్రీశైలంలో మూడోరోజు వైభవంగా కొనసాగిన దసరా ఉత్సవాలు

శ్రీశైలం, అక్టోబరు 5: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, చండీహోమం, పంచాక్షరీ, భ్రామరీ, బాలాజపానుష్ఠానాలు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారి పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్రపారాయణలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా కుమారి పూజలు జరిపించారు. ఈ కుమారి పూజలలో రెండు సంవత్సరాలు నుంచి పది సంవత్సరాలలోపు బాలికకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు.

దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు అమ్మవారికి నవదుర్గా అవతారాలలో ఒకటైన చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు దశభుజాలను కలిగిన ప్రశాంతమైన వదనంతో సాత్విక స్వరూపినిగా ఉంటారు. ఈ దేవి శాంతిస్వరూపిణి అయినప్పటికీ యుద్ధోన్ముఖురాలై ఉండటం విశేషం. వాహనసేవలలో భాగంగా రావణవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ముంగిట జానపద కళాకారుల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అశేష భక్తజనం గ్రామోత్సవంలో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను కనులారా వీక్షించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.







నృత్యం చేస్తున్న కళాకారులు

నేడు కూష్మాండదుర్గగా అమ్మవారు

దసరా మహోత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం భ్రమరాంబికాదేవి కూష్మాండదుర్గ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు కైలాస వాహన సేవ నిర్వహించనున్నారు.



ప్రత్యేక వేషధారణలో కళాకారులు



ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న నృత్య, నాటిక ప్రదర్శనలు



టెట్‌కు 168 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 5: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 168 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. శనివారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 1265 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1097 మంది అభ్యర్థులు టెట్‌కు హాజరయ్యారు. 168 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 635 మందికి గానూ 547 మంది హాజరుకాగా 88 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో 630 మందికిగానూ 550 మంది హాజరు కాగా, ఇందులో 80 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ తనిఖీ చేసి పరీక్ష నిర్వాహకులకు సూచనలు చేశారు.

8న జాబ్‌మేళా

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి ఎల్ ఆనంద్ రాజకుమార్ తెలిపారు. బిర్లాగేట్ సమీపంలోని న్యాక్ శిక్షణా కేంద్రంలో ఉదయం 10గంట నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్, అంతా ప్రాజెక్టు టెక్నికల్ సర్వీసు, ఫేరాన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, చదివి 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఈ జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ. పదివేల నుంచి రూ, 20 వేలకు జీతం ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ?

- చర్చల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగులకు

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులను ఉద్యోగులు ఆదివారం నుంచి బహిష్కరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 1న దుకాణాలు మూసివేసి నిరసన తెలిపారు. స్పందించిన ప్రభుత్వం ఈనెల 5న చర్చలకు ఆహ్వానించింది. శనివారం సాయంత్రం వరకు సాగిన చర్చల్లో అసోసియేషన్ నాయకులకు మరో రెండు రోజులు ఆగాలని ఆపైన ప్రభుత్వ నిర్ణయం వెల్లడిస్తుందని పేర్కొన్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. జతిన్ చంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 12న కొత్త మద్యం పాలసీ అమలులోకి రానున్నందున తమను చర్చల పేరుతో కాలయాన చేస్తున్నారని మండిపడ్డారు. తమకు ప్రత్యామ్నాయం చూపేంత వరకు ఆదోళనలు కొనసాగిస్తామని, ప్రస్తుతం దుకాణాల్లో విధులకు దూరంగా ఉండాలని మెజార్టీ ఉద్యోగులు కోరుతున్నారని, ఆ మేరకు ఆదివారం విధులపై ఉదయాన్నే రాష్ట్రస్థాయిలో ఓ నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఎందరో ఉద్యోగులు ప్రభుత్వ మద్యం దుకాణాల ప్రైవేట్‌పరం చేయడంతో ఉద్యోగులు రోడ్డున పడనున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 5: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో కన్వీనరు కోటా కింద పరిమిత సంఖ్యలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ లోక్‌నాథ్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఉర్దూవర్సిటీలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కోర్సులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదని రిజిస్ట్రార్ తెలిపారు.

సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం

- హాజరైన మంత్రి బీసీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్
- అభినందనలు తెలిపిన డోన్ నియోజకవర్గ నాయకులు



మంత్రి బీసీ సమక్షంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



ధర్మవరం సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న డోన్ నాయకులు

డోన్, అక్టోబరు 5: రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. శనివారం విజయవాడలోని ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారులు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో సుబ్బారెడ్డి తన సతీమణి మల్లేశ్వరితో కలిసి వేదపండితుల ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత డోన్ నియోజకవర్గ పార్టీ నాయకులు, అభిమానుల కోలాహలం మధ్య సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సుబ్బారెడ్డికి మంత్రి బీసీ, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్లా నారాయణ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున రెడ్డి, బేతంచెర్ల పట్టణ పార్టీ నాయకులు షేక్షావలి చౌదరి తదితరులు అభినందనలు తెలిపారు. అనంతరం సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మవరం చిన్న నాగిరెడ్డి, గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, కిష్టన్న, ఎల్‌ఐసీ శ్రీరాములు, ఎర్రిస్వామి గౌడ్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్

రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన ప్రమాణస్వీకారోత్సవ సభలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పదవి ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేస్తానన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పార్టీ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు డోన్ ఇన్‌చార్జిగా పని చేశానని, ఇప్పుడు అచ్చెన్నాయుడు బాధ్యతలు తీసుకున్న శాఖకు అనుబంధంగా ఉండే పదవిలో పని చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎంతో మనోధైర్యాన్నిచ్చి తనను ముందుకు నడిపించారన్నారు. డోన్ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు చేసిన కష్టంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని, వారి రుణం తీర్చుకునేలా పని చేస్తానన్నారు. రైతుబిడ్డగా తనకు రైతుల ఇబ్బందులు తెలుసునని, వారికి సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కృషి చేస్తానని సుబ్బారెడ్డి అన్నారు.

ఫొటో ఓటర్ల నమోదుకు శ్రీకారం

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ జారీ

కర్నూలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫొటో ఓటర్ల నమోదుకు ప్రత్యేక సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా రూపొందించేందుకు షెడ్యూలు విడుదల చేశారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా రూపొందించేందుకు జిల్లాలో ఓటర్ల నమోదు అధికారులు (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), సహాయ ఓటర్ల నమోదు అధికారులు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు) సిద్ధం కావాలని కలెక్టరు పి.రంజిత్‌బాషా శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు జారీ చేసిన ఆదేశాలు పాటించాలని సూచించారు. ఈ నెల 29న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆ తరువాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ప్రజలు నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం 2025 జనవరి 1న తుది జాబితాను ప్రకటిస్తారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు త్వరగా దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు5: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ నమోదు దరఖాస్తుకు ఈనెల 7వ తేదీ చివరి తేదీ అన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18.01.2025 ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

అవుకు, అక్టోబరు 5 : అవుకు రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం శనివారం సాయంత్రం లభ్యమైంది. జీఎన్ఎస్ఎస్ కాల్వ ద్వారా నీటి ప్రవాహానికి మృతదేహం కొట్టుకొని వచ్చినట్లు భావిస్తున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రిజర్వాయర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోయి ఉండటంతో ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సంజామల, అక్టోబరు 5: ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. శనివారం ఏఎస్ఐ రామకృష్ణా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిల్లి సుబ్బరాయుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడేవాడు. దాంతో మనస్తాపం చెంది చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు యువరైతు మృతి

వెలుగోడు, అక్టోబరు 5: నంద్యాల జిల్లా వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామంలో పిడుగుపాటుకు యువరైతు శివగంగాధర్ (26) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. గ్రామ శివారులోని తెలుగుగంగ కట్టపై మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోసుకున్నాడు. ధాన్యం ఆరబోసిన ప్రాంత సమీపంలో శుక్రవారం రాత్రి తన మిత్రుడు వెంకటేశ్వర్లతో కాపలా ఉంటూ నిద్రించారు. శనివారం తెల్లవారుజామున వర్షం కురుస్తున్న సమయంలో మిత్రుడు వెంకటేశ్వర్లును నిద్రలేపకుండానే శివగంగాధర్ ఒక్కడే ధాన్యంపై టార్పాలిన్ పట్టాలను కప్పేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధర్‌కు తల్లిదండ్రులు లేరు. అవ్వ దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఒకే రోజు నలుగురు చిన్నారుల మృతి

- నీటిలో పడి ముగ్గురు
- కూల్‌డ్రింక్ అనుకొని పురుగుల మందు తాగి ఒకరు
- ఎమ్మిగనూరు నియోజకవర్గంలో విషాదం



మహిరాం (ఫైల్) | సంపత్‌కుమార్ (ఫైల్) | ఉదయ్‌కిరణ్ (ఫైల్) | హనిమేష్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్/టౌన్ అక్టోబరు 5: ఎమ్మిగనూరు నియోజకరవ్గంలో ఒకేరోజు నలుగురు చిన్నారులు మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. అభంశుభం తెలియని ఆ చిన్నారులు ఇంట్లో ఉంచిన పురుగు మందు డబ్బాలను చూసి కూల్‌డ్రింక్ అనుకున్నారు.. ఒకరి తర్వాత ఒకరు తాగారు. కొద్దిసేపటికి ఓ చిన్నారికి కడుపులో నొప్పి రావడంతో విషయాన్ని తల్లికి చెప్పాడు.. ఏమి జరిగిందో తెలియని ఆ తల్లి చిన్నారిని ఎత్తుకొని చూడగా చిన్నారి నోటి నుంచి పురుగుల మందు వాసన వచ్చింది. దీంతో పురుగుల మందు తాగాడని తెలుసుకొని చిన్నారిని ప్రశ్నించగా తనతో పాటు తన పక్కలో ఉన్న మరో చిన్నారి కూడా తాగినట్లు చెప్పాడు. ఆందోళనకు గురైన ఆ తల్లి, కుటుంబ సభ్యులు ఇద్దరు చిన్నారులను గ్రామంలో ప్రైవేటు వైద్యం కోసం ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే చిన్నారి మహిరాం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో చిన్నారి హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎమ్మిగనూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామానికి చెందిన కాశిం, జయలక్ష్మిలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో చిన్నకుమారుడు మహిరాం(5) గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. అలాగే వారి బంధువు మహేష్, అనసూయలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. అందులో చిన్న కుమారుడు ఏడేళ్ల హరికృష్ణ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఇరువురి కుటుంబాలు బంధువులు కావడంతో గ్రామంలోని పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. అయితే దసరా సెలవులు కావడంతో చిన్నారులు ఇంటి సమీపంలో ఆడుకుంటూ ఇంటి బయట బాత్‌రూంలో ఉన్న మందు డబ్బాలను చూశారు. కూల్‌డ్రింక్ అనుకొని ఒకరి తర్వాత ఒకరు తాగారు. తల్లి జయలక్ష్మి గమనించి బంధువులతో కలిసి హుటాహుటిన ఇద్దరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మహిరాం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉన్న హరికృష్ణను కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటి వరకు అల్లారి ముద్దుగా ఆడుతూ పాడుతూ అందరినీ అలరించిన చిన్నారుల్లో మహిరాం మృత్యువాత పడడం, హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంకలో పడి 13 ఏళ్ల బాలుడి మృతి

పండుగ ఉందని ఎంతో ఆనందంతో తన అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చిన ఓ 13 ఏళ్ల బాలుడు అనంతలోకాలకు చేరుకున్న విషాద సంఘటన శనివారం ఎమ్మిగనూరు మండలంలోని పార్లపల్లిలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం సంతనాగలాపురం గ్రామానికి చెందిన మణిక్యారావు పార్లపల్లిలో శాంతకుమారిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు తండ్రితో పాటు కూలీ పనులకు వెళ్తున్నారు. చిన్న కుమారుడు సంపత్ కుమార్(13) 5వ తరగతి చదువుతున్నాడు. అయితే తమ అమ్మమ్మ వాళ్ల ఊరైన పార్లపల్లిలో కోతగాళ్ల పండుగ ఉండడంతో తల్లి శాంతకుమారితో కలిసి పార్లపల్లికి వచ్చాడు. బంధువుల పిల్లలు సందీప్, జగన్‌లతో కలిసి గ్రామ సమీపంలోని ఎర్రకోట రోడ్డులో ఉన్న వంక దగ్గరకు బహిర్భూకి వెళ్లారు. బహిర్భూమి అనంతరం వంక దగ్గర కాళ్లు కడుక్కునేందుకు వెళ్లగా సంపత్‌కుమార్ కాలుజారి వంకలో పడిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు వంకలో భారీస్థాయిలో నీరు ఉండటంతో నీటి ఉధృతికి మునిగిపోయాడు. భయపడిన తోటి చిన్నారులు పరిగెత్తుకుంటూ వచ్చి ఇంటి దగ్గర కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి వచ్చి వంకలో మునిగిపోయిన సంపత్‌కుమార్‌ను గాలించి బయటకు తీసి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సంపత్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉండగా ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన వడ్డె శివ, పార్వతిల కుమారుడు ఉపేంద్ర (10) పొలంలో ఉండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఒకే రోజు మండలంలో కె.నాగలాపురంలో ఒక బాలుడు, పార్లపల్లిలో మరొక బాలుడు మృతి చెందడం, కడివెళ్లలో మరో బాలుడు పాముకాటుకు గురికావడంతో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణమంతా చిన్నారుల బంధువుల రోదనలతో మిన్నంటింది.

నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

నందవరం: మాచాపురం గ్రామంలో నీటి కుంటలో పడి శనివారం ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామంలోని బీవీ మోహన్‌రెడ్డి కాలనీ సమీపంలో దాయాదుల పిల్లలైన హనుమేష్(6) ఉదయ్‌కిరణ్(11) బహిర్భూమికి వెళ్లారు. హనుమేష్ కుంటలో నీరు తెచ్చేందుకు వెళ్లి జారి అందులో పడ్డాడు. హనుమేష్‌ను కాపాడేందుకు కుంటలోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో గిలగిల కొట్టుకోవడాన్ని స్నేహితులు వంశీ, చరణ్‌లు చూసి కేకలు వేశారు. దీంతో చుట్టు పక్కల వారు వచ్చి వారిని బయటకు తీసి ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. తల్లిదండ్రులు, బంధువుల రోదనలు చూపరులను కంట తడిపెట్టించాయి. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను తెలుసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

నగర పాలకలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నియామకం

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 5: నగర పాలక సంస్థ కార్యాలయంలో పరిపాలన సౌలభ్యం కింద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నియమిస్తూ కమిషనర్ రవీంద్రబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆరుమందికి స్థానచలనం కలిగింది. అయితే వారి స్థానంలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు ఒక్కో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు కొన్ని రెవెన్యూ వార్డులను కేటాయించారు. ఎస్.శేషాద్రి జూనియర్ అసిస్టెంట్(బి2) 1 నుంచి 39, 41,42, 52 నుంచి 68, ఎం.రాజు(జీ1) సీనియర్ అసిస్టెంట్‌కు 40,46 నుంచి 50, 69 వార్డులు, ఎస్.తిప్పన్న జూనియర్ అసిస్టెంట్(ఏ1) 70 నుంచి 80, పి.భార్గవ జూనియర్ అసిస్టెంటు(జీ2) 81 నుంచి 87, 103 నుంచి 127, ఎం.నాగరాజు(ఈ2) సీనియర్ అసిస్టెంట్‌కు 43 నుంచి 45, 51, 88 నుంచి 102 వార్డులను కేటాయించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

సి.బెళగల్, అక్టోబరు 5: ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని నదితీరా గ్రామాలైన మాలేసోమాపురం, తిమ్మనదొడ్డి, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ఈర్లదిన్నె, శింగవరం గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

'భూముల స్వాధీనం ఆపాలి'

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 5: ఓర్వకల్లు మండల పరిధిలో గ్రీన్‌కో ఎనర్జీ సంస్థ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న రైతుల భూముల ప్రక్రియను ఆపాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం శనివారం ఒక ప్రకటనలో కోరారు. సంస్థ ఉత్పత్తి చేస్తున్న సౌరవిద్యుత్తు వల్ల చుట్టుపక్కల అనేక గ్రామాలలో రైతుల తమ విలువలై భూములు, పెద్దలు సంపాదించిన వారసత్వభూముల కోల్పోతున్నారని అన్నారు. రైతులకు చెప్పకుండ, గ్రామసభలు నిర్వహించకుండా రైతుల భూముల లాక్కుంటున్నారని తక్షణమే ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు


కర్నూలులో వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 5: దేవీ నవరాత్రి ఉత్సవాలు కర్నూలు నగరంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణతో పాటు విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఇందులో భాగంగా వివిధ ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, మహా మంగళ హారతులు, కుంకుమార్చనలు చేపట్టారు. మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో అమ్మవారు మీనాక్షీ దేవిగా, చిన్న అమ్మవారిశాలలో గౌరి గణపతిగా, నగరశివారులోని గోదా గోకుల క్షేత్రంలో ధైర్య లక్ష్మిగా దర్శనమిచ్చారు. రాత్రి అమ్మవారికి ఊంజల సేవ అనంతరం కిరణ్ బృందంతో సంకీర్తనల పారాయణం చేశారు. వన్‌టౌన్‌లోని నిమిషాంబ, కాళికాంబ ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా, పాతనగరంలోని గీతామందిరంలో వేంకటేశ్వరస్వామిగా, సప్తగిరినగర్‌లోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఉన్న చౌడేశ్వరి మాతా ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

గూడూరు: గూడూరులోని వీరభద్రస్వామి ఆలయంలో శనివారం మూడో రోజుఅమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● మండలంలోని కెనాగలాపురం గ్రామంలోని సుంకులాపరమేశ్వరి అమ్మవారు శనివారం అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనా, మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పురోహితులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఓర్వకల్లులోని శికారికాలనీలో సుంకులమ్మ, చౌడేశ్వరి ఆలయాల్లో అలాగే హుశేనాపురం, లొద్దిపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల, గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హుశేనాపురం గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.

కల్లూరు: గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు డి.లక్ష్మీనరసింహశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి, ట్రస్టీ టి.శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


గూడూరులో అన్నపూర్ణాదేవిగా.. సూర్యనారాయణ స్వామి ఆలయంలో గాయత్రీదేవిగా.. ఓర్వకల్లు శికారికాలనీలో.. కె నాగలాపురంలో అన్నపూర్ణ దేవిగా..

పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, అక్టోబరు 5: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందజేస్తున్న పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చరితారెడ్డి, ఏడీఏ శాలురెడ్డి శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ మండలానికి 2,650 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరయ్యాయని, రైతులకు అవసరమైతే ఇంకా మంజూరు చేస్తామని తెలిపారు. రైతులకు సాగు చేసే ప్రతి రైతుకు శనగ విత్తనాలు అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పుల్లారెడ్డి, ప్రకాశం, తిరుపాలు, రాజన్న, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం: ఎమ్మెల్యే


రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, అక్టోబరు 5: రైతులను టీడీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శనివారం సబ్సిడీ కింద రైతులకు పప్పు శనగ విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం 25శాతం సబ్సిడీ కింద విత్తనాలను అందిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా వ్యవసాయ అధికారులను సంప్రందించి విత్తనాలను కొనగోలు చేసుకోవాలన్నారు. మండలానికి 2200 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ సాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్, టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీలో వ్యర్థాల తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 5: ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న హంద్రీలో వ్యర్థాలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇటీ వల జరిగిన నగర పాలక సమీక్ష సమావేశంలో మంత్రి టీజీ భరత్ ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న హంద్రీలో ఆక్రమణలను తొలగించాలని, నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ అధికారులు మూడు ఎక్స్‌కవేటర్లతో బ్రిడ్జి పక్కన ఉన్న మట్టి కుప్పలను తొలగించడంతోపాటు చెట్లు, చెత్తను తీసేసి హంద్రీ నుంచి వచ్చే నీటిని సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఉస్మానియా కళాశాల, జోహరాపురం బ్రిడ్జి వద్ద కూడా హంద్రీ లోని వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


హంద్రీలో వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

పుస్తకాల విరాళం

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 5: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్ కంప్యూటర్ విద్యకు సంబంధించిన పలు పుస్తకాలు విరాళంగా అందజేశారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ పుస్తకాలను ఆయన లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు ఉపయుక్తగా నిలిచే ఈ పుస్తకాలను విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తక దాత షేక్ అబ్దుల్ రజాక్‌ను గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, టెక్నికల్ లైబ్రేరి యన్ ఎస్ బాషా, ఈశ్వరమ్మ, పద్మావతమ్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వీరేష్

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 5: హిమాచల్ ప్రదేశ్‌లో ఈ నెల 6 నుంచి 13 వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీ ల్లో కర్నూలు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు బి.వీరేష్ పాల్గొంటున్నారు. వీరికి క్రీడాదాత జి.శ్రీధర్ రెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షులు తలారీ కృష్ణ నాయుడు వీరేష్‌ను సన్మానించారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ పాపా డీఎస్ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్ బాషా పాల్గొన్నారు.

పప్పు శనగ విత్తనాల మంజూరు

సి.బెళగల్, అక్టోబరు 5: మండలానికి పప్పు శనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పప్పు శనగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుబుక్‌లు, ఆధార్, ఫోన్‌నెంబరుతో రైతు భరోసా కేంద్రాల్లోని ఎంపీఈవోలను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో కన్యాకుమారి వాసి మృతి

కర్నూలు, అక్టోబరు 5: రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కర్ణాటక బ్యాంకులో విద్యుదాఘాతంతో కన్యాకుమారి వాసి శనివారం మృతి చెందాడు. కన్యాకుమారి జిల్లాకు చెందిన బెన్నిస్ (28) అనే వ్యక్తి కర్ణాటక బ్యాంకులో ఎలక్ట్రికల్ పని చేసేందుకు వచ్చాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడ పని చేసే ఉద్యోగులు అప్రమత్తమై హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 11 కేసులు నమోదు

కర్నూలు, అక్టోబరు 5: నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 11 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సి.క్యాంపు సర్కిల్ వద్ద ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 ద్విచక్ర వాహనదారులు, ఒక ఆటో డ్రైవర్‌పై కేసులు నమోదు చేశారు. వాహనాలను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ యు.ఎర్రన్న, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్‌యూ అంతర్ కళాశాలల మహిళా పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 5: స్థానిక సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో రాయలసీమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆర్‌యూఐసీటీ-2024 మహిళా అంతర్ కళాశాలల పోటీలు శనివారం ముగిశాయి. ఆర్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ హాజరై గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, శ్రీసాయికృష్ణ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జానీబాషా, కాంపిటీటివ్ ప్రిన్సిపాల్ సుందర్‌రాజ్, ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కేవీ శివకిశోర్ పాల్గొన్నారు.

విజేతలు: కబడ్డీ మహిళా పోటీల్లో ప్రథమ స్థానంలో శ్రీసాయికృష్ణ డిగ్రీ కాలేజీ నిలవగా, ద్వితీయ స్థానంలో శ్రీలక్ష్మి బీపీడీ కాలేజీ, తృతీయ స్థానంలో సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ నిలిచింది. ● మహిళా చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కాలేజీ, ద్వితీయ స్థానంలో సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ, తృతీయ స్థానంలో వెంకాయపల్లి రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ నిలిచాయి.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కల్లూరు, అక్టోబరు 5: వీరశైవ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం నగరంలోని వీవీఎస్ ఫంక్షన్ హాల్లో వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. సభ్యులు సెక్రటరి రమేష్, ట్రెజరర్ మల్లికార్జునస్వామి పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 5: దసరా సెలవు దినాల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని పీడీఎస్‌యూ శాఖ డిమాండ్ చేసింది. శనివారం ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతుల నుంచి విద్యార్థులను బయటకు పంపి పాఠశాలను మూసివేయించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు తరగతులు నిర్వహిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), అక్టోబరు 5: నగరంలోని ఇండస్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఐదో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్, డీఎస్‌డీవో భూపతిరావు హాజరయ్యారు. కేఈ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాసనం తప్పని సరి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలు నవంబరులో మైసూరులో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో హాజరు కావాలని జిల్లా ప్రతినిధి శివరాజప్ప తెలిపారు. అంతకు ముందు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏపీ ప్రెసిడెంట్ రాధిక, సహాయ ప్రెసిడెంట్ బాల సుబ్రహ్మణ్యం, మల్లికార్జన, టెక్నికల్ డైరెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులకు దసరా కానుకలు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 5: రోజా మహిళా ఐక్యసంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత, కర్నూలు కళాకారుల సంఘం అధ్యక్షుడు బైలుపల షఫీఉల్లా ఆధ్వర్యంలో పేద మహిళా కార్మికులకు దసరా కానుకలు పంపిణీ చేశారు. శనివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో కార్మిక శాఖ ఉపకమిషనర్ కే.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు కానుకలు అందజేశారు. కళాకారుల సంఘం నాయ కులు హనుమంతరావు చౌదరి, రాముడు, ఆంజనేయులు, షాలుమియా పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేస్తా

కల్లూరు, అక్టోబరు 5: సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో పదవి ఇచ్చారని పాణ్యం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఏపీ అర్బన్, ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు అన్నారు. విజయవాడలో ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గౌరు దంపతుల నమ్మకాన్ని వమ్ము చేయక పదవికి మంచి పేరు తీసుకువస్తానని రామాంజనేయులు అన్నారు. అనంతరం ఏపీ అర్బన్, ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో ఐటీడీపీ పాణ్యం అధ్యక్షుడు వెంకటరమణ, ఉలిందకొండ రమణ, పాండు, మాదేష్, ధనుంజయ, పర్ల శేఖర్, మస్తాన్, విజయ్, ఆర్‌బి కృష్ణ, బస్తిపాడు రాజు పాల్గొన్నారు.

'డంప్‌యార్డును ఊరికి దూరంగా తరలించాలి'

గూడూరు అక్టోబరు 5: గూడూరు నగర పంచాయతీ పరధిలోని మునగాల రహదారిలో ఉన్న డంప్ యార్డును ఊరికి దూరంగా తరలించాలని టీడీపీ నాయకుడు వీరకృష్ణ గౌడ్ అన్నారు. శనివారం గూడూరులో టీడీపీ నాయకుడు వీరకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పడమర బీసీ కాలనీ మహిళలు, ప్రజలు డంప్ యార్డ్ దగ్గరకు తరలివచ్చి ఇక్కడ చెత్త వేయరాదని ట్రాక్టరును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంప్‌యార్డ్ వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అధికారులు దృష్టి సారించి ఊరికి దూరంగా తరలించాలని కోరారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

సి.బెళగల్, అక్టోబరు 5: పండ్లతోటల్లో నీరు నిల్వకుండా చూడాలని కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, సిబెళగల్, గొల్లల దొడ్డి గ్రామాల్లో రైతులు సాగు చేసిన జామ, దానిమ్మ, మునగ, మామిడి, కొబ్బరితోటలను పరిశీలించారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న, రైతులు ఉన్నారు.

నేడు సాహితీ సదస్సు

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 5: నగరంలోని సాహితీ సదస్సు సాహిత్య సంస్థ, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రంథాలయ పితామహుడు దివంగత ముచ్చుకోట వెంకట రామయ్య స్మారకోపన్యాసం సమావేశం ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోటలో ఏర్పాటు చేశామని, 'స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయోద్యమ పాత్ర' అనే అంశంపై బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకుడు డాక్టర్ కె.బడే సాహెబ్ ముఖ్యవక్తగా ప్రసంగిస్తారని తెలిపారు.

మానసిక దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హస్పిటల్), అక్టోబరు 5: సేవకు సంపదతో పని లేదని కేవలం సహాయం చేయాలన్న ఆలోచన ఉంటే చాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. శనివారం నగరంలోని ఆదిత్య విద్యానిలయంలో కల్లూరు ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 60 మంది మానసిక దివ్యాంగులకు డాక్టర్ శంకర్‌శర్మ పింఛన్లను పంపిణీ చేశారు. ఆదిత్య విద్యానిలయం కరస్పాండెంట్ వాసుదేవయ్య, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

నేడు కర్నూలులో రుమటాలజీ రాష్ట్ర సదస్సు

హాజరుకానున్న 250 మంది వైద్యులు

కర్నూలు(హస్పిటల్), అక్టోబరు 5: కర్నూలు మెడికల్ కాలేజీలో ఆదివారం రుమటాలజీ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ రుమటాలజిస్టు డాక్టర్ ఏ.సృజన తెలిపారు. రుమటాలజి అసోసియేషన్ హైదరాబాదు చాప్టర్, కేఎంసీ సొసైటీ ఆఫ్ జనరల్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో సదస్సుకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా హైదరాబాదు చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.రాజేంద్ర వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టిన రసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. రుమటాయిడ్, అర్థరైటిస్, కీళ్లనొప్పులు వాటి నివారణ పద్ధతులు, చికిత్సల గురించి సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ఏపీ, తెలంగాణకు చెందిన 250 మంది రుమటాలజీస్టులు, జనరల్ ఫిజీషియన్ పాల్గొంటారని తెలిపారు.

కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

కర్నూలు(కల్చరల్), అక్టోబరు 5: పౌరాణిక నాటక కళాకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కళావాహిని సాంస్కృతిక సాహిత్య సంస్థ వ్యవస్థాపకుడు ఎం. మనోహర్ బాబు అన్నారు. ఇటీవల మరణించిన సీనియర్ రంగస్థల కళాకారుడు, కర్నూలుకు చెందిన జీసీ సుబ్బారావు సంస్మరణ సభను శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి కళాకారులు నివాళులర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సీనియర్ రంగస్థల నటులు, దర్శకులు పి.దస్తగిరి, వీవీ రమణారెడ్డి, నాగేశ్వరరావు, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సీనియర్ కళాకారులు సత్కరించారు.

ప్రగతిపథంలో ఉపాధి హామీ పథకం

కల్లూరు, అక్టోబరు 5: ఉపాధిహామీ పథకంలోని అన్ని అంశాలలో ప్రగతి పథంలో నిలిచేలా ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.ఎన్.శేషాచలరెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో 200 రోజులు యాక్షన్‌ప్లాన్‌పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏపీవోలు మద్దీశ్వరమ్మ, రమాదేవి ఆధ్వర్యంలో ఎంపీడీవోను సన్మానించారు. కార్యక్రమంలో ఈసీ మధు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి: ఏపీఎం

సి.బెళగల్, అక్టోబరు 5: పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం రమేష్ తెలిపారు. శనివారం కార్యాలయంలో పొదుపు మహిళలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఈసమావేశంలో సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం, అక్టోబరు 5: శ్రీమఠం అన్నదానానికి బెంగళూరుకు చెందిన లలితమ్మ రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి శనివారం తెలిపారు. మరో దాత రూ.లక్ష కలిపి మొత్తం రూ.2 లక్షలు వచ్చాయన్నారు. దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

'దళితుల అభివృద్ధికి కృషి చేయాలి'

కోసిగి, అక్టోబరు 5: రాజకీయాలకతీతంగా దళితుల అభివృద్ధికి కృషి చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. శనివారం కందుకూరులో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు రామకోటి హనుమంతు, అయ్యన్న అధ్యక్షతన కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కేవీపీఎస్ లక్ష్యాలని, ఎస్సీ కాలనీలను అభివృద్ధి చేయాలని కోరారు. అంజి, చిన్న మారెయ్య, వీరేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లారీ, బైకు ఢీ.. వ్యక్తికి గాయాలు

తుగ్గలి, అక్టోబరు 5: లారీ, బైకు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం జొన్నగిరి ఎస్ఐ జయశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం నుంచి అనంతపురానికి బైక్‌పై వెళ్తున్న సాయిః సమార్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలయ్యాయి క్షతగాత్రున్ని గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యానికి అనంతపురానికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోయ లక్ష్మికి ఆర్థిక సాయం

మంత్రాలయం, అక్టోబరు 5: మండలంలోని కల్లుదేవకుంటకు చెందిన బోయ లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా సచివాలయ ఉద్యోగులు చేయూత అందించారు. భర్త బోయ బీసన్న ఇటీవలే గుండెపోటుతో మృతి చెందాడు. కర్నూలులో శస్త్ర చికిత్స చేయించుకుని ఒంటరిగా ఉండటంతో పూడగడవడం లేదు. స్పందించిన ఉద్యోగులు రూ.6వేలు అందజేశారు. ఉద్యోగులు వెంకటేశ్, నగేష్, లక్ష్మిరెడ్డి, భవిత, రాధ, రిజ్వాన, గౌరమ్మ రేష్మా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'సొసైటీల్లో డిపాజిట్లు సురక్షితం'

తుగ్గలి, అక్టోబరు 5: సొసైటీలో డిపాజిట్ చేసిన నగదు సురక్షితమని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య, మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు తెలిపారు. శనివారం సొసైటీ కార్యాలయాల్లో రైతులు డిపాజిటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అధిక వడ్డీలకు ఆశపడి ఇతరులకు నగదును ఇచ్చి మోసపోవద్దని, సొసైటీల్లో డిపాజిట్ చేస్తే మంచి వడ్డీ అందిస్తామన్నారు.

ఏబీఆర్ఎస్ఎం కార్యదర్శిగా రాజశేఖర్ రావు



ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 5: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాజశేఖర్ రావు భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. భూపాల్‌లో ఏబీఆర్ఎం సమావేశంలో జాతీయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆపాస్ కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటికే బాధ్యతలు నిర్వర్తించారు. తాయప్ప, శ్రీనివాసులు, రామకృష్ణరావు, భైరప్ప, జ్ఞానేశ్వరరావు, దేవేంద్రనాథ్ రెడ్డి, ప్రతాప్, సూర్య హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గోనెగండ్ల, అక్టోబరు 5: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చే సినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. శనివారం హెచ్. కైరవాడి గామ సమీపంలోని హంద్రీ నది నుంచి పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈజ్ చేశామని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు

ఆలూరు, అక్టోబరు 5: సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 9 మద్యం దుకాణాలకు 14 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ లలిత దేవి, ఎస్ఐ నవీన్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నూతన విధానంలో 9వ తేదీన సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోసిగి: సర్కిల్ పరిధిలో నాలుగు మద్యం దుకాణాలకు 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ పి.భార్గవరెడ్డి కోరారు. శనివారం మాట్లాడుతూ కోసిగి మండలంలో రెండు, పెద్దకడుబూరు మండలంలో రెండు మొత్తం నాలుగు మద్యం షాపులకు ఇప్పటి వరకు 2 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు.

క్షయ నివారణపై అవగాహన

ఆదోని టౌన్, అక్టోబరు 5: క్షయ రోగులకు సంబంధించి మొండి కేసులపై శనివారం ప్రభుత్వ క్షయ వైద్య కేంద్రంలో అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఎస్ బాబురాజు వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, ప్రభుత్వం అందించే మందులు, ఆర్థిక సహాయం గురించి వివరించారు. సిబ్బంది మల్లికార్జున, స్వరూప్ కుమార్, లలితమ్మ, సుబ్బమ్మ బాయి, కళావతి పాల్గొన్నారు.

పరిశ్రమలను ఏర్పాటు చేయాలి



మంత్రి నారా లోకేశ్‌తో సురేంద్ర

అలూరు, అక్టోబరు 5: వెనుకబడిన ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర కోరారు. శనివారం మంత్రి లోకేశ్‌ను కలిశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పార్టీకి సేవలందించినవారిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

నందవరం, అక్టోబరు 5: మండలంలోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేశాయి మాధవరావు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీఆర్ ఏఈ నరసింహులు శనివారం కలిశారు. మండలంలోని పనులను ఏఈ వివరించారు.



దేశాయి మాధవరావుతో పీఆర్ ఏఈ

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



మెడికల్ కిట్లు అందజేస్తున్న పాస్టర్లు, వైద్యులు

మంత్రాలయం, అక్టోబరు 5: పిల్లల ఆరోగ్యంపై పెద్దలు శ్రద్ధ తీసుకోవాలని హోలెస్టిక్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఇండియా డైరెక్టర్ పిలిప్ జార్జ్, ఈడీ థన్‌ఖచ్చన్ సూచించారు. శనివారం మాధవరం సెయింట్ థోమస్ మిషన్ ఫాదర్స్ రెవ.జాన్ కేజాకబ్ లింటు థరగస్ ఆనంద్ జేఎస్ ఆధ్వర్యంలో కల్లుదేవకుంట వైద్యాధికారి గోవిందమ్మ అధ్యక్షతన విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ కిట్లు అందజేశారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని, వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు భారతి, రాజేశ్వరి, లక్ష్మి, పుష్పలత, రాధ, సామ్సొన్, రుహీన్ మేరీ షాజీ, అభినవ్, కిట్టు, యశ్రత్, సాత్విక్, సుశాంక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గొంతెండుతోంది

- పదిహేను రోజులకోసారి తాగునీరు
- విద్యుత్ సరఫరాలో అంతరాయమే కారణం




అరికెరలో ట్యాంకు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ఆలూరు రూరల్, అక్టోబరు 5: విరుపాపురం జలాశయం నుంచి 14 గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతోంది. హొళగుంద, హాలహర్వి, ఆలూరు మండలాలకు తాగునీరు అందుతోంది. ఆలూరు నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తుతుండటంతో తాగునీటి పంపింగ్‌కు ఇబ్బందిగా మారింది. అరికేర, అరికేర తండా, ముద్దనగేరి, కురకుంద, నెరణికి తండా, నెరణికి, కొత్తపేట, నిట్రవట్టి తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జలాశయా నికి సరఫరా అయ్యే లైన్‌ను, ఇతరమైన వాటికి కూడా ఇవ్వడంతో లోడ్ ఎక్కువై సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

పదిహేను రోజులకోసారి...

ఈ జలాశయం నుంచి పదిహేను రోజులకోసారి సరఫరా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని జలాశయం కాంట్రాక్టర్ పుల్లయ్య వాపోయారు. పండుగపూట తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు సక్రమంగా రావడం లేదు



తాగునీరు సక్రమంగా రావడం లేదు. 15 రోజుల నుంచి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలి

- సుధాకర్ రెడ్డి, సర్పంచ్, ముద్దనగేరి

తాగునీరు అందిస్తాం



విరుపాపురం జలాశయం నుంచి తాగునీరు అందిస్తాం. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిపాం.

-మల్లికార్జునయ్య, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



కల్వర్టులో బోల్తాపడ్డ కారు

కోసిగి, అక్టోబరు 5: ఉరుకుంద రోడ్డులో శనివారం కారు బోల్తాపడి భక్తులు గాయపడ్డారు. వివరాల మేరకు.. ఉరుకుందలో దర్శనం చేసుకుని ఈడిగ బాబు, లక్ష్మి కుటుంబ సభ్యులు కారులో తిరిగి కోసిగికి బయలుదేరారు. కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి డ్రైవర్ ప్రక్కకు వెళ్లే క్రమంలో కారు అదుపుతప్పి కల్వర్టులో బోల్తా పడింది. బాధితులు గాయపడ్డారు.

ఉచిత ఇసుక ఇవ్వాలి

మద్దికెర, అక్టోబరు 5: ప్రభుత్వం ఉచిత ఇసుకను ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరాముడు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ కూటమి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: వీరభద్రగౌడ్

హాలహర్వి, అక్టోబరు 5: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సకాలంలో శనగ విత్తనాలు అందించిన ఘనత టీడీపీది అని ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం హాలహర్విలో రైతులకు విత్తనాలు అందజేశారు. సకాలంలో వర్షాలు కురిశాయని, సీఎం చంద్రబాబు నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నారన్నారు. రైతులు ఆందోళన చెందకుండా తీసుకోవాలని, మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రహల్లాద రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, ఏవో శివశంకర్, ఏడీఏ సునీత, నాయకులు శ్రీధర్, ఎంపీడీవో వరలక్ష్మీ, తహసీల్దార్ నజీమాబాను, డీటీ లక్ష్మి పాల్గొన్నారు.



విత్తన ప్యాకెట్‌ను అందజేస్తున్న వీరభద్రగౌడ్

చోరీ కేసులను త్వరగా ఛేదించాలి : ఎస్పీ

ఆదోని, అక్టోబరు 5: చోరీ కేసులను త్వరగా ఛేదించాలని ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సీఐలకు సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 2003 నుంచి దొంగతనం రికవరీలపై ప్రత్యేక దృష్టిసారించి 80శాతానికి పైగా చేయాలని అన్నారు. అలాగే ఆదోనిలో మట్కా, జూదంపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారు ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని సూచించారు. మట్కా జూదం ఆగకపోతే పోలీసుల పనితనాన్ని చర్చించాల్సి ఉంటుందన్నారు. క్రైమ్‌రేటు తగ్గించే విధంగా పని చేయాలని అన్నారు. డీఎస్పీ సోమన్న పాల్గొన్నారు.



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

అవినీతికి ప్యాచ్

హొళగుంద, అక్టోబరు 5 : గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ ఎన్నికల ముందు వేసిన రోడ్డు మూడు నెలలకే గుంతలు పడింది. దీంతో తిరిగి వాటికి ప్యాచ్‌లు వేస్తున్నారు. హొళగుంద వాల్మీకి సర్కిల్ నుంచి మార్లమడికి గ్రామానికి పీఆర్ శాఖ 4.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించింది. అయితే పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో కాంట్రాక్టర్ ప్యాచ్ వర్క్ చేసి చేతులు దులుపుకున్నారు. మురళి రైస్ మిల్ వద్ద ఎల్ఎల్‌సీ చిన్న కాలువకు కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు వేశారు. కల్వర్టు నిర్మించకుండానే రోడ్డు వేయడడంతో పది రోజుల క్రితం బైకులు ఢీకొని ఓ వ్యక్తి తన రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. పీఆర్ ఏఈ చంద్రను వివరణ కోరగా బిల్లులు చెల్లించకున్నా కాంట్రాక్టర్ నాణ్యతతో రోడ్డు వేస్తున్నారని తెలిపారు.



మార్లమడికి వద్ద గుంతకు వేసిన ప్యాచ్

'నిందితులను అరెస్టు చేయాలి'

గోనెగండ్ల, అక్టోబరు 5: ఆదోని మండలం కడతట్ల గ్రామంలో పొలం పనులు చేసుకుంటున్న శాంతిరాజుపై దాడి చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. అదే గ్రామానికి చెందిన అగ్రకులం వారు శాంతిరాజు పొలంలో నుంచి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా అభ్యంతరం తెలిపాడని, దీంతో వారు శాంతిరాజుపై దాడి చేశారన్నారు. పోలీసులు కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

మధ్యాహ్నానికే సచివాలయానికి తాళం



తాళం వేసిన జోహరాపురం సచివాలయం

ఆస్పరి, అక్టోబరు 5: మండలంలోని జోహరాపురం సచివాలయం మధ్యాహ్నానికే మూతపడింది. ఉద్యోగుల తీరుతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

దేవనకొండ, అక్టోబరు 5: గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని వైద్యాధికారి కళ్యాణ్ సూచించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు..

ఉచిత ఇసుక ఇవ్వాలి

మద్దికెర, అక్టోబరు 5: ప్రభుత్వం ఉచిత ఇసుకను ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరాముడు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ కూటమి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. పనులు లేవని, గ్రామాల నుంచి తెస్తే పోలీసులు పట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నాణ్యమైన విత్తనాలు అందేలా చూడండి

తుగ్గలి, అక్టోబరు 5: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర కోరారు. శనివారం అమరావతిలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో నాణ్యమైన విత్తనాలు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారని, మన ప్రభుత్వంలో అలా కాకూడదన్నారు. అనంతరం సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలిపి రైతుల సమస్యలు విన్నవించామని తెలిపారు. సీఎం చంద్రబాబు పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తారన్నారు. పత్తికొండ వెనుకబడిన ప్రాంతమని విత్తనశుద్ధి కర్మాగారం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాగేంద్ర

దూదేకులకు పదవులు ఇవ్వాలి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 5: దూదేకులకు జనాభా ప్రకారం పదవులు, నిధులు కేటాయించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి, దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సాయిబాబా కోరారు. శనివారం ఉండవల్లిలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. దూదేకుల సామాజిక వర్గం టీడీపీ అధికారంలోనికి రావడానికి కృషి చేసిందన్నారు. మైనార్టీ శాఖ నుంచి నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.



మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న సాయిబాబా

అన్నపూర్ణ దేవి అలంకరణలో గాయత్రీమాత

ఆస్పరి, అక్టోబరు 5 : రామతీర్థక్షేత్రం జోహరాపురంలో గాయత్రీ మాత, పెద్దమ్మవ్వ అన్నపూర్ణదేవీ అలంకారంలో శనివారం దర్శనమిచ్చారు. కుంకుమార్చన, మంగళహారతి నిర్వహించాగా, యువకులు చెక్కభజన చేశారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పూజలు నిర్వహిం చారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆస్పరి: రామతీర్థంలో..

రాజ్మా అలంకరణలో అవ్వ దర్శనం

ఆదోని టౌన్: మహాయోగి లక్ష్మమ్మ ఆలయంలో శనివారం లక్ష్మమ్మ అవ్వను వేరుశనగ విత్తనాలు, రాజ్మాలతో నిర్వాహకులు అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే రాయచోటి రామయ్య తొలి పూజ చేశారు. అనంతరం అవ్వను మూల బృందావనాన్ని భక్తులు దర్శించుకొని పూజలు చేసారు.

మద్దికెర: ప్రతి ఒక్కరిలో దైవచింతన ఉండాలని బెంగుళూరు పుష్పాండ మహర్షి ఆశ్రమం తొగాట క్షత్రీయ కుల గురువు శ్రీదివ్యాజ్ఞానందగిరి అన్నారు. శనివారం చౌడేశ్వరి ఆలయంలో మాట్లాడుతూ యువత చెడుమార్గంలో కాకుండా సన్మార్గం వైపు నడవాలని కోరారు. అనంతరం పీఠాధిపతిని పెద్దకోట్ల రమేష్ సన్మానించారు.

అన్నపూర్ణ దేవి అలంకరణలో పార్వతీదేవి

మద్దికెర నగరేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం ఉదయం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముత్యాల రాజశేఖర్ శెట్టి, ముత్యాల సుదర్శన్ శెట్టి, సుంకు రవీంద్ర, శోడాల రమ, కాశీవిశ్వనాథ్, భక్తులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి అలంకరణ

ఎమ్మిగనూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు పాండురంగస్వామి అలంకరణలో దర్శనమిచ్చింది. వీవర్స్ కాలనీ మైదానంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. సోగనూరు రోడ్డులోని జమ్ములమ్మ ఆలయంలో శాఖాంబరి దేవిగా దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమివ్వడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

అధికారులు పార్టీలకతీతంగా పనులు చేయాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పెద్దకడుబూరు, అక్టోబరు 5: అధికారులు పార్టీలకతీతంగా పనులు చేయాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం విషయం అధికారులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమస్యలను సమావే శం దృష్టికి తెచ్చి పరిష్కరించు కోవాలని సూచిం చారు. ఎంపీపీ శ్రీవిద్య మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో భోజనం నాణ్యత ఎందుకు పాటించడం లేదని ఎంఈవో సువర్ణ సునియంను ప్రశ్నించారు. స్పందించిన ఎఈవో నాణ్య మైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసు కుంటామని తెలిపారు. అనంతరం మధు హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైస్ ఎంపీపీలు ముత్తమ్మ, ఇర్ఫాన్ దేశాయి, జడీటీసీ రాజేశ్వరి, పెద్దకడు బూరు సర్పంచ్ రామాంజినేయులు, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఎమ్మిగనూరు, అక్టోబరు5: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. శనివారం ఉప్పర కల్యాణ మంటపంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చెంద్రుపాటి మంజుల, భానుమూర్తి, పూర్వ ప్రధాన కార్యదర్శి పాండు రంగ వరప్రసాద్ అందజేశారు. అనంతరం ఉపాధ్యా యులను సన్మానించారు. రవికుమార్, అశోక్‌కుమార్, ఎంఈవో మధుసుదన్‌రాజు, ఏపీ వీరన్న, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, సోమేశ్వరి, కళావతి, దొడ్డిమేకల టీచర్ వీరేష్ పాల్గొన్నారు.

'టీడీపీపై ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు'

దేవనకొండ, అక్టోబరు 5: గాలిమరల కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడి చేస్తే ఎమ్మెల్యే విరుపాక్షి టీడీపీపై నిందలు మోపడం సరికాదని ఆ పార్టీ నాయకులు రంగన్న, వెంకటస్వామిగౌడ్, వీరేష్ అన్నారు. గ్రీన్ ఇన్‌ఫ్రా కంపెనీ సబ్ స్టేషన్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారని, అభివృద్ధికి సహకరించకుండా, దాడులకు తెగబడ్డారని అన్నారు. ప్రజలు తిరస్కరించినా వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. సర్పంచ్ భాస్కర్, కప్పట్రాళ్ల మల్లికార్జున, గిడ్డయ్యగౌడ్, రాజాసాబ్, బాలకృష్ణ, శ్రీను, తిమ్మయ్య, రంగన్న పాల్గొన్నారు.

సర్దుబాటును విరమించుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 5: విద్యుత్, ఇందన చార్జీల సర్దుబాటు ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఐ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శనివారం సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. వైసీపీ పెంచిన భారాలాను భరించలేక ప్రజలు ఇంటికి పంపారన్నారు. టీడీపీ సర్దుబాటు పేరుతో పెంచడం సరికాదన్నారు

ఎంపీడీవోగా విజయలత

హొళగుంద, అక్టోబరు 5 : ఎంపీడీవోగా విజయలలిత శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా వజ్రకరూర్ నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

ఎంపీడీవోగా కృష్ణమోహన్

తుగ్గలి: ఎంపీడీవోగా కృష్ణమోహన్, ఈవోఆర్డీగా శ్రీహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తుగ్గలి ఎంపీడీవోగా పని చేస్తున్న సావిత్రి బదిలీ కావడంతో ఆమెను సిబ్బంది సన్మానించారు. సూపరింటెండెంట్ బాషా, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, రాంబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు గోపాల్, రామాంజనేయులు, రాజు నాయక్, శివ, రామకృష్ణ ఉన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, అక్టోబరు 5: శ్రీమఠానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిర్సింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంక టేష్ జోషి పరిమళ ప్రసాదం కొరత రానీయకండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రథోత్సవం ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జీలు, హోటళ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

గజ వాహనంపై ప్రహ్లాదరాయలు

మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. నవరాత్రుల్లో శనివారం తదియను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూజలు నిర్వహించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు

తెలంగాణ రాష్ట్ర బీసీ సెల్ కమిషనర్ నిరంజన్, కర్ణాటక రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మంత్రి మునియప్ప, మంత్రి శివరాజ్ తంగడిగి శనివారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. తహసీల్దారు రవి, అనంతపు రాణిక్, జేపీ స్వామి, ఏఎస్ఐ పెద్దయ్య, బిందుమాధవ్, వ్యాస రాజార్, ప్రకాష్ ఆచార్, బసప్ప, రంగస్వామి, వీఆర్వో భీముడు తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో రద్దీగా ఉన్న శ్రీమంతం ప్రాంగణం